నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

- **కలెక్టర్ సంతోష్**

గద్వాల,సెప్టెంబర్ 4 : గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి బుధవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఈ ఏడాది జిల్లాలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. వినాయక చవితి నిమజ్జనం ఈసారి నది అగ్రహారం, జమ్మిచేడ్, బీచుపల్లి, జూరాల డ్యాం ఈ నాలుగు ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో, డీఎస్పీ నోడల్ పాయింట్లుగా వ్యవహరించాలని సూచించారు. తాసీల్దార్లు, పోలీస్ అధికారులు కలిసి గణేశ్ ఆర్గనైజర్లతో సమన్వయం చేసుకోవాలని, అధికారులు వాట్సాప్ గ్రూపుల ద్వారా వివరాలు ఎప్పటికప్పుడు తెలుసు కోవాలని సూచించారు. నిమజ్జనానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అందుకు అవసరమైన రోడ్లను మరమ్మతులు చేపట్టాలన్నారు. గణేశ్ నిమజ్జనం వద్ద బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్‌అధికారులకు ఆదేశించారు. వైద్యాధికారులు నిమజ్జన ప్రదేశాల వద్ద వైద్య సేవలు అంది ంచడానికి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. నదిప్రాంతంలో ఈతగాళ్లను అందుబాటులో ఉంచి వారికి ప్రత్యేక టీషర్టులను అందజేయాలన్నారు. సంబంధిత తాసీల్దార్లతో మత్స్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసు కోవాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో లైటింగ్ పవర్ జనరేటర్లు, బారికేడ్స్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికా రులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లే కుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశించారు. గణేశ్ వేడుకలు మొదలు నిమజ్జనం పూర్తయ్యేవరకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్సైజ్ అధికారులు నిమజ్జన సమయంలో మద్యం దుకాణాలు ముందుగానే మూసివేసేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల వద్ద సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, అధికారులు సత్యానా రాయణ, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- **రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**

దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

పెబ్బేరు, సెప్టెంబర్ 4: భారీ వర్షాలకు దెబ్బతిన్న పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన శేరిపల్లె వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా తక్షణ చర్యలు చేపట్టి రాకపోకలకు అనువుగా మార్చాలని ఆయన సూచించారు.

తెగిన కల్వర్టును సరిచేయాలి

కేటీదొడ్డిలో తెగిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- **ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

కేటీదొడ్డి, సెప్టెంబర్ 4 : అకాల వర్షాలకు తెగిన కల్వర్టును వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని ఈర్లబండ, పాతపాలెం గ్రామాల మధ్యనున్న కల్వర్టు తెలగిపోవడంతో బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హన్మంతు, గడ్డం కృష్ణారెడ్డి, వెంకన్‌గౌడ్, అమ్రేశ్, గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హన్మంతు, కృష్ణ, రంగాపురం, శేఖర్, గోపి తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

గట్టు,సెప్టెంబర్ 4 : సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. గట్టు చెరువును స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు. నీటి ప్రవాహాన్ని పరిశీలించి పదిరోజుల్లో చెరువు నిండవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బజారి, కృష్ణ, రాజప్ప, వెంకన్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 4 : గట్టు మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డే మల్లేశ్ తేలు కాటుకు గురికాగా కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వ దవాఖానకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 4 : ప్రభుత్వ దవాఖాన ఏరియాలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, దవాఖాన పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నర్సింగాయపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ దవాఖాన మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దవాఖాన ప్రాంగణాల్లో వర్షపు నీరు ఉండిపోవడం రోగులు ఇబ్బందులకు గురికావడాన్ని దృష్టిలో ఉంచు కొని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్, టీఎస్ఎంఐడీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌పై షాపులు నిర్మించుకోవడాన్ని పరిశీలించిన కలెక్టర్ అనుమతులు లేకుండా నిర్మించిన షాపులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. భవిష్యత్‌లో దవాఖాన పరిసరాల్లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా దవాఖాన ప్రాంగణంలో రూ.23.75 కోట్ల నిధులతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను డిసెంబర్ 31చివరిలోగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించారు. సెప్టెంబర్ 9న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా దవాఖానలో ఆక్సిజన్ ప్లాంట్, ఓపీ రూమ్, హైమాస్క్ లైట్ ప్రారంభించే విధంగా ఏర్పాటు చేయాలని టీజీఎంఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ జైపాల్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం డయాగ్నోస్టిక్ హబ్‌ను పరిశీలించారు. దవాఖాన ఒకచోట సీటీ స్కాన్ మరో చోట ఉండడం సరికాదని దీనిని ప్రభుత్వ దవాఖానకి మార్చేందుకు ప్రణాళికలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో లేబర్ రూమ్, పిల్లల వార్డులు సందర్శించి వైద్యులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ రంగారావు ఉన్నారు.

దవాఖాన పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలి

ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని మరో భవనంలోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభిని బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నాగవరం సమీపంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం కారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా వర్షపు నీరు కుర్వకుండా తాత్కాలికంగా చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. త్వరలో భవనం మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డి , వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలి

పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరూర మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ విద్యులత, కలెక్టర్ చేతులమీదుగా బుధవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవోపీ విగ్రహాలతో నీటిని కాలుష్యం పెరుగుతుందని అందుకని మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం సమాజహితమవుతుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా జిల్లాలో 8అంగుళాల వినాయక మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సైంటిస్ట్ విద్యులత తెలిపారు.

లే అవుట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి

ప్రభుత్వ భూమి, చెరువు శిఖం, కాల్వల పక్కన ఉన్న లే అవుట్ల అనుమతించబడవని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి లే అవుట్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించి టీజీ బీపాస్ ద్వారా వచ్చిన నాలుగు లే అవుట్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు , లే అవుట్ లోపల ఉన్న రోడ్లు ప్రభుత్వానికి గిఫ్ట్ డిడ్ ముందే చేయాలని అదేవిధంగా 10 శాతం స్థలం ప్రభుత్వానికి మార్టిగేజ్ చేసి ప్రహరీ నిర్మించాలని, అందులో మొక్కలు పెంచాలని సూచించారు. లే అవుట్‌లో డ్రైయినేజీ , నిబంధనల మేరకు రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి ఉండాలని సూచించారు. లే అవుట్ ప్రతిపాదనలు కమిటీ ముందు రాకముందే అదనపు కలెక్టర్ , ఇరిగేషన్, మున్సిపల్, రోడ్లు, భవనాలు, విద్యుత్ శాఖ అధికారులు కలిసి సైట్ ఇన్స్పెక్షన్ చేయాలని ఆదేశించారు. చెరువు శిఖం భూమి, అసైన్డ్ భూమిలో ఉంటే ముందే గుర్తించి లే అవుట్ తిరస్కరించాలని సూచించారు. వచ్చిన 4 లేఅవుట్లు కమిటీ ముందుకు తీసుకురాగా పరిశీలించి ఒక డ్రాఫ్ట్ లే అవుట్‌ను అమోదించి మరో లే అవుట్‌ను షరతులతో అమోదించారు. మిగిలిన రెండు లే అవుట్లను పెండింగ్‌లో పెట్టారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్, రోడ్లు భవనాల డీఈ సీతారామస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, విద్యుత్ శాఖ ఈఈ, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

- **పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు**

మానవపాడు, సెప్టెంబర్ 4 : మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మానవపాడు-అమరవాయి గ్రామాల మధ్యన ఉన్న పెద్దవాగు పొంగి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మానవపాడు-అమరవాయి మధ్య వాగు ప్రమాదకరంగా పారుతుండడంతో పోలీసులు అక్కడికి చేరుకొని రాకపోకలను నియంత్రించారు. అలాగే నారాయణపురం నుంచి పోతులపాడు శివారు వరకు వాగుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు నీట మునడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మానవపాడు, నారాయణపురం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రైల్వే అండర్ పాస్ కింద వర్షం నీరు నిలవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీనిపై రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉధృతిని పరిశీలించిన తాసీల్దార్

ఉండవెల్లి, సెప్టెంబర్ 4 : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెన్నిపాడు సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వాగు ఉధృతంగా పారుతుండడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సలీమొద్దీన్, ఎంపీడీవో తిరుపతయ్య మెన్నిపాడు వాగును పరిశీలించారు.

మెన్నిపాడు వాగును పరిశీలిస్తున్న అధికారులు

ఉధృతంగా ప్రవహిస్తున్న వల్లూరు పెద్దవాగు

ఎర్రవల్లిలో భారీవర్షం

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 4 : ఎర్రవల్లి మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. భారీవర్షంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వల్లూరు పెద్దవాగు, గార్లపాడులోని పెద్దవాగు,షేక్‌పల్లి పెద్దవాగులు ఉప్పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొత్తకోట,సెప్టెంబర్ 4 : హైవేపై రాత్రి పూట పార్కింగ్ లైట్ వేసుకోకుండా ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి ముమ్మళ్లపల్లి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (28) మధ్యాహ్నం పెద్దమందడి మండలం అల్వాలలో బంధువు ఇంటికి శుభాకార్యానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. ఫంక్షన్ ముగించుకుని తిరిగి రాత్రి స్వగ్రామానికి వ స్తుండగా ముమ్మళ్లపల్లి సమీపంలో హైవేపై పార్కింగ్ లైట్ వేయకుండా లారీని ఆపడంతో చూసుకోకుండా బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసులు లారీని వెనుక నుంచి ఢీకొట్టంతో గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వనపర్తి మార్చూరీకి తరలించారు. మృతుడి భార్య జనుంపల్లి సంధ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

రెండు వడ్ల లారీల పట్టివేత

కొత్తకోట,సెప్టెంబర్ 4 : మండలంలోని పామాపురం సమీపంలో రెండు వడ్ల లారీలను బుధవారం సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు వడ్ల లారీలు కోస్గి నుంచి వడ్లను కొనుగోలు చేసుకొని పామాపురం మీదుగా కర్నూల్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న వడ్ల లారీలను స్థానిక పోలీసులకు అప్పగించారు. వీటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వివరాలు అడిగితే ఈ విషయంపై దాటవేశారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించామని గురువారం వారు వచ్చి పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాగా పట్టుబడిన ఈ రెండు లారీలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుకున్న వెంటనే సీసీఎస్ పోలీసులు పత్రాలు సరిగ్గా లేకపోవడంతో పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, సెప్టెంబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు నంద్యాలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, సావిత్రమ్మ కలిసి తమ బంధువును కారులో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దించి కర్నూల్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గంమధ్యలో కోదండాపూర్ రైస్ మిల్లు దగ్గర జాతీయ రహదారిపై అదేమార్గం నుంచి వెళ్తున్న కారు(తుఫాన్) వెనుకనుంచి ఢీకొట్టడంతో విశ్వనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తుఫాన్ డ్రైవర్ మల్లారెడ్డిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో మహిళ పై వేధింపులు

- **భర్త ఫిర్యాదుతో కేసు నమోదు**

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 4 : ప్రభుత్వ అధికారులతో మంచి పరిచయాలు ఉన్నాయని ఉద్యోగం ఇప్పిస్తా..అని ఓ మహిళకు మాయమాటలు చెప్పి వేధింపులకు గురిచేసిన ఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల టౌన్ ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు జిల్లా కేంద్రానికి చెందిన తెలుగుపేటకు చెందిన రాజు అనే వ్యక్తి అదే కాలనీకి చెందిన ఓ మహిళతో చనువు పెంచుకొని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి తరచూ వాట్సాప్‌లో చాట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేసేవాడు. భార్య ఫోన్‌లో వస్తున్న మేసేజ్‌లను పరిశీలించిన భర్త భార్యను మందలించారు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. తన భార్యను ఉద్యోగం పేరుతో ఇబ్బందులకు గురి చేసి వ్యక్తిపై భర్త ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

- **డీఏవో సక్రియా నాయక్**

అయిజ, సెప్టెంబర్ 4 : భారీ వర్షాల కారణంగా వరద లొచ్చి నీట మునిగి పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామని డీఏవో సక్రియా నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పత్తి, కంది, మిరప, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను డీఏవో పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో జనార్దన్, ఏఈవో యువరాజు, రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో సక్రియా నాయక్

నీట మునిగిన పంటల పరిశీలన

మల్దకల్, సెప్టెంబర్ 4 : మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. బుధవారం ఏవో రాజశేఖర్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో నీట మునిగిన సీడుపత్తి, వరిపంటలను ఏఈవోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండల కేంద్రంలో 50ఎకరాలు, బిజ్వారంలో 20 ఎకరాలు, విఠాపురంలో 15 ఎకరాలు మేకలసోంపల్లిలో 15ఎకరాలు, అలాగే వివిధ గ్రామాల్లో 150 ఎకరాల్లో వర్షం నీరు నిలిచిందన్నారు.

అమరచింత మండలంలో..

అమరచింత, సెప్టెంబర్ 4 : అమరచింత పెద్ద చెరువు అలుగుపారడంతో నీటమునిగిన పంటపొలాలను బుధవారం ఏవో అరవింద్ పరిశీలించారు.

సామాజిక తనిఖీలో అక్రమాల గుర్తింపు

- **రూ.1,12,326 రికవరీకి ఆదేశాలు**

ఉండవెల్లి, సెప్టెంబర్ 4: మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జీ అడిషనల్ కలెక్టర్, డీఆర్‌డీవో నర్సంగరావు ఆధ్వర్యంలో బుధవారం సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. 16 గ్రామ పంచాయతీల్లో 2023-2024సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్లు డీఆర్‌డీవో పేర్కొన్నారు. మొత్తం రూ.మూడు కోట్ల 44లక్షల 39వేల 837 పనులు చేపట్టగా రూ.1,12,326 అక్రమాలు జరిగినట్లు గుర్తించి వాటిని వెంటనే రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతన్న, ఏపీవో సౌజన్య, విజిలెన్స్ అధికారి శ్రీనివాస్‌తోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రూ.3.31 కోట్ల పనులు పూర్తి

పెబ్బేరు, సెప్టెంబర్ 4 : 2023-24 ఏడాదిలో పెబ్బేరు మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.3,31,63,640 విలువైన పనులను చేపటినట్లు జిల్లా విజిలెన్స్ అధికారి రహీం, అదనపు డీఆర్‌డీవో నాగేంద్ర చెప్పారు. పది రోజులుగా మండలంలో 14వ విడుత ఉపాధి పనుల తనిఖీ నిర్వహించి.. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించగా మొత్తం 601పనులు చేపట్టినట్లు వెల్లడైందని వారు తెలిపారు. సామగ్రికి సంబంధించి రూ. 25లక్షల పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర, అంబుడ్స్‌మెన్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిన్నోనిపల్లి బాధితుల సమస్యలు పరిష్కరించాలి

చిన్నోనిపల్లిలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న హన్మంతు నాయుడు

- **బాసు హన్మంతు నాయుడు**

గట్టు, సెప్టెంబర్ 4: చిన్నోనిపల్లి రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు నాయుడు కోరారు. మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ ముంపు బాధితలను బుధవారం కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నోనిపల్లి గ్రామ ప్రజలకు ఇవ్వాల్సిన పరిహారం త్వరగా చెల్లించి గ్రామాన్ని ఖాళీ చేయించాలన్నారు. గ్రామంలో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్లాట్లు మంజూరు చేయాలని అలాగే వారికి ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే మునిగిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నూర్‌పాషా, రాజు, తిమ్మప్ప గౌడ్, బొజ్జయ్య నాయుడు,నల్లారెడ్డి, మద్దిలేటి, చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాల్వకు మరమ్మతు పనులు

కొత్తకోట,సెప్టెంబర్ 4 : మండలంలోని రామకృష్ణాపురం గ్రామ శివారులోని రామన్‌పాడు కాల్వ కల్వర్టు ఒక వైపు కూలిపోవడంతో రామకృష్ణాపురం, పామాపురం గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారులను మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించడంతో బుధవారం పనులు చేపట్టారు.

కల్వర్టు పనులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇటిక్యాల, సెప్టెంబర్ 4 : అధిక వర్షాలు కురుస్తుండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ నరేందర్ సూచించారు. మట్టి మిద్దె ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు అందులో నివాసం ఉండరాదని, అధిక వర్షాలతో తడిసి కూలిపోయే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాలతో కూలిన ఇండ్ల సమాచారం తాసీల్దార్ కార్యాలయానికి అందిస్తే విచారించి తగు న్యాయం చేస్తామని చెప్పారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, సెప్టెంబర్ 4 : ఓపెన్ ఇంటర్, పదో తరగతిలో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కేవీ రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్, పదిలో చేరాలనుకొనే వారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్ శేషన్‌ను లేదా ఫోన్ నెంబర్ 9885994554ను సంప్రదించాలన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 4: సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవ త్సరానికి గానూ డిగ్రీ ఫస్టియర్‌లో బీఏ హెచ్ఈసీ, బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్, ఎంపీసీ కంప్యూట ర్ సైన్స్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ తదితర కోర్సుల్లో ఈనెల 5,6 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఇంటర్ పూర్తిచేసిన మహిళలు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 7995010680ను సంప్రదించాలని సూచించారు.

రక్త నమూనాల సేకరణ

పాన్‌గల్, సెప్టెంబర్ 4 : మండలంలోని జమ్మాపూర్ గ్రామంలో బుధవారం మలేరియా, డెంగీ పాజిటివ్ రక్త నమూనాలను మండల వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేకరించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారశశాంక్, సుమనశ్రీ, రాంచందర్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

అంధకారంలో బీసీ కాలనీ

అమరచింత, సెప్టెంబర్ 4 : మున్సిపాలిటీలోని బీసీ కాలనీలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అంధకారంలో ఉంటున్నారు. జెడ్పీ పాఠశాల ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికాగా విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేయించినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం వరకు మరమ్మతులు పూర్తికాకపోవడంతో మూడురోజు కూడా బీసీ కాలనీకి అంధకారం తప్పలేదు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పట్టణంలోవిద్యుత్ సమస్యలను పరిష్కారం చేయాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూరు, సెప్టెంబర్ 4 : అపహరణకు గురైన సెల్‌ఫోన్ పోలీసుల దొరకబట్టి బాధితులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం ..పట్టణంలోని సర్కార్ దవాఖాన వైద్యురాలు ప్రసన్న మీన గతనెల 5వ తేదీన మహబూబ్‌నగర్ నుంచి ఆత్మకూరుకు వస్తుండగా దొంగలు తన స్మార్ట్‌ఫోన్‌ను దొంగలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో ఫోన్ ఉన్నట్లు గుర్తించి, ఫోన్‌ను ట్రాక్ చేసి ఆత్మకూరుకు తెప్పించారు. బుధవారం వైద్యురాలు ప్రసన్న మీనకు ఫోన్‌ను అందజేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుర్వ నల్ల హన్మంత్

నూతన పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 4 : గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుర్వ నల్ల హన్మంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో హన్మంత్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా శ్రీకాంత్ రెడ్డి, మిగతా సభ్యులు డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకమండలిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సుభాన్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, కుర్మన్న, రమేశ్ నాయుడు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748